సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 6 । జూలై । 2023



మిస్టరీగానే బాలుడి అదృశ్యం

బుట్టాయగూడెం మండలం కొత్తనరుగుడులో అదృశ్యమైన సూర్యతేజ కేసు మిస్టరీగానే ఉంది. ఎనిమిది పోలీస్ బృందాలు గాలించినా ఇంకా ఆచూకీ దొరకలేదు. 8లో ▸



చురుగ్గా ఫేజ్–2 రీ సర్వే

పశ్చిమగోదావరి జిల్లాలో ఫేజ్–2 భూముల రీ సర్వే ముమ్మరంగా సాగుతుంది. 93 గ్రామాల్లో డ్రోన్ ప్లే, ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజస్ ప్రక్రియ పూర్తి చేశారు. 8లో ▸

జూనోసిస్ వ్యాధులతో జాగ్రత్త



జంతువులకు సోకే జూనోసిస్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.
8లో

న్యూస్‌రీల్

జగనన్న సురక్షపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న జేసీ రామ సుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక క్యాంపులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింటు కలెక్టరు జగనన్న సురక్ష, రీ సర్వే, సీసీఆర్‌సీ కార్డుల జారీ తదితర అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులలో ఎన్ని టోకెన్లు ఇచ్చారు, వాటి ప్రకారం ప్రజలకు వివిధ ధ్రువపత్రాలు అందజేశారా? అన్న అంశాల్ని సమీక్షించారు. ప్రభుత్వం నుంచి నిర్దేశించిన 11 సర్వీసులు కాక ఇతర సర్వీసులలో వచ్చిన రిక్వెస్ట్‌లు కూడా నివేదికలుగా జిల్లా కలెక్టరేట్‌కు పంపాలని ఆయన తెలిపారు. రీ సర్వేలో 21 రోజులలో పూర్తిచేయాలని సంబంధిత తహసీల్దారుల వద్ద ఆలస్యమైతే ఇచ్చిన గడువులో పూర్తి చేయలేమని జాయింట్ కలెక్టర్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టరు ఎం. సూర్యతేజ, ఆర్డీవో దాసిరాజు, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

సాక్షి, భీమవరం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా భీమవరం పశువైద్యశాలలో ఈ నెల 6న పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పార్ల సుధీర్‌బాబు చెప్పారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఉచిత టీకాల కార్యక్రమాన్ని పెంపుడు కుక్కల యజమానులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తణుకులో జిల్లా బ్యాడ్మింటన్ సెలెక్షన్స్

తణుకు టౌన్: పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఈ నెల 14,15,16 తేదీల్లో బ్యాడ్మింటన్ సెలెక్షన్లు తణుకులో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి మెంటే వంశీ కృష్ణ, కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి తెలిపారు. తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళాకళాశాలలోని శ్రీ చిట్టూరి సుబ్బారావు–సత్య ఉషారాణి ఇండోర్ స్టేడియంలో ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 11, 13, 15, 17, 19 బాలురు, బాలికల విభాగాలలో ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు.

సైబర్ నేరాలకు చెక్

- స్పెషల్ సైబర్ టీంలు సిద్ధం
- ఆరు జిల్లాల్లో 173 మంది పోలీసులకు శిక్షణ పూర్తి
- వచ్చే వారం నుంచి మరో 180 మందికి శిక్షణ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలీసు శాఖలో స్పెషల్ సైబర్ టీంలు రెడీ అయ్యాయి. సైబర్ కేసులపై సమగ్ర అవగాహన కల్పించడమే ప్రధాన అజెండాగా స్టేషన్ల వారీగా సైబర్ టీంలను సన్నద్ధం చేస్తున్నారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో కంప్యూటర్‌పై అవగాహన ఉన్న కానిస్టేబుళ్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మొదటి బ్యాచ్‌లో ఆరు జిల్లాలకు కలిపి 173 మందికి శిక్షణ ఇచ్చారు. వచ్చే వారం నుంచి మరో 180 మందికి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రతి స్టేషన్ పరిధిలో సైబర్ క్రైమ్ చట్టాలు, సత్వర న్యాయం తదితర అంశాలపై నిష్ణాతులైన ఇద్దరు కానిస్టేబుళ్లు ఉండేలా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది.

ఆన్‌లైన్ నేరాలు, సైబర్ చట్టాలపై అవగాహన

ఇటీవల కాలంలో ఆన్‌లైన్ నేరాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా లోన్ యాప్స్ మొదలుకొని ఆన్‌లైన్‌లో గేమ్స్ వరకు అనేకమంది మోసాల బారిన పడుతున్నారు. మూడేళ్ల క్రితం వరకు ఆన్‌లైన్ మోసాల తీవ్రత చాలా తక్కువగా ఉండేది. పెరిగిన టెక్నాలజీ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలతోనే పెరిగాయి. సగటున ప్రతి జిల్లాలో రోజూ ఒకటి, రెండు కేసులు నమోదవుతూనే ఉన్నాయి. అయితే సీఆర్‌పీసీ, ఐపీసీ పోలీస్ చట్టాలపై మాత్రమే పోలీసులకు అవగాహన ఉంది. ఈ క్రమంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైమ్స్ యాక్ట్, ఇతర చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. లోన్‌యాప్ కేసులు నమోదైతే బాధితులు మోసపోకుండా చర్యలు తీసుకునేలా, ఆన్‌లైన్‌లో ఇతర మోసాలకు సంబంధించి పేమెంట్ గేట్‌వేలో నగదు నిలిపివేత, ఫిర్యాదు తీసుకున్న వెంటనే ఏఏ సెక్షన్ల కేసు నమోదు ఇలా అన్ని అంశాలపై శిక్షణా తరగతులు జిల్లాల వారీగా నిర్వహించారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఏలూరు, పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలో తొలి దశలో 173 మంది కానిస్టేబుళ్లకు ఏఎస్పీ, ఇద్దరు సీఐలు, సైబర్ క్రైమ్స్ చట్టాలపై నిష్ణాతులైన వారితో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వీరందరూ స్టేషన్‌లో సాధారణ విధులతో పాటు ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ కేసులపై ఫోకస్ పెట్టేలా చర్యలు తీసుకున్నారు. వచ్చే వారం నుంచి 180 మంది సిబ్బందికి ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మొత్తంగా 500 మంది కానిస్టేబుళ్లను ఏలూరు రేంజ్ పరిధిలో సన్నద్ధం చేయనున్నారు. శిక్షణ పొందిన వారికి అంతర్గతంగా టెస్ట్‌లు నిర్వహించి జిల్లా స్థాయిలో 15 మందితో మరో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయనున్నారు. కొన్ని స్టేషన్లలో సైబర్ చట్టాలపై అవగాహన లేక కేసులు కూడా రిజిస్ట్రేషన్ చేయలేని పరిస్థితి. కొన్ని సందర్భాల్లో నిమిషాల వ్యవధిలో స్పందించకపోతే బాధితులు పూర్తి నష్టపోయే పరిస్థితులున్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపేలా ప్రత్యేక బృందాలు పనిచేయనున్నాయి.

ఆరు నెలల్లో 197 కేసులు

2018 నుంచి సైబర్‌క్రైమ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 2018లో 212 కేసులు నమోదైతే ఆ తరువాత నుంచి సగటున 400 కేసులు నమోదవుతున్నాయి. ఈ ఒక్క సంవత్సరంలోనే 197 కేసులు నమోదయ్యాయి. ఇటీవల రాజమండ్రిలో సైబర్ క్రైమ్ మోసాలకు సంబంధించి రెండు కేసుల్లో తక్షణం బాధితులకు న్యాయం జరిగేలా రికవరీ చేశారు.

శిక్షణ కొనసాగిస్తాం



రేంజ్ పరిధిలో సుమారు 180 పోలీస్ స్టేషన్లల్లో సుమారు 500 మందికి ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. ప్రతి స్టేషన్ పరిధిలో ఇద్దరు కానిస్టేబుళ్లతో పాటు ఇన్‌స్పెక్టర్, డీఎస్పీలు, హెడ్‌కానిస్టేబుళ్లకు శిక్షణ నిర్వహిస్తున్నాం. జిల్లా స్థాయిలో 15 మంది సిబ్బందితో ప్రత్యేకంగా టీం ఏర్పాటు చేస్తున్నాం. భవిష్యత్తులో సైబర్ నేరాలు పూర్తి స్థాయి కట్టడికి ఈ టీంలు పనిచేస్తాయి.
– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

సీఎం ఢిల్లీ పర్యటనతో చంద్రబాబుకు గుబులు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



జగ్గన్నపేటలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: గుజరాత్ గుజ్జుభాయ్.. మోడీ అని, ఆయన ఎవరికీ ఒక పట్టాన అర్థం కాడని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన అంటే చంద్రబాబు గుండె లబ్ డబ్ లబ్ డబ్‌మంటూ కొట్టుకుంటుందని విమర్శించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 29 సార్లు ఢిల్లీ పర్యటన చేశాడని, ఏనాడూ మోదీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. నాడు చంద్రబాబుకు నిధులిస్తే ప్రజలకు చేరవని తెలిసి తొక్కిపట్టారన్నారు. నేడు జగన్ పాలనలో ప్రతి రూపాయి ప్రజలకు చేరుతుందని భావించి నాడు రావలసిన నిధులను విడుదల చేస్తున్నారన్నారు. ఇది చంద్రబాబుకు కంటికి ఇంపుగా కనిపించడం లేదన్నారు. దీన్ని పవన్ కళ్యాణ్ సమర్థిస్తాడా? అని నిలదీశారు. చంద్రబాబు దరిద్రాన్ని వదిలించుకుంటేనే గాని పవన్‌ను ప్రజలు గుర్తించరని స్పష్టం చేశారు. తొమ్మిది నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

యువత చేతుల్లోనే దేశ భవిత

సబ్ కలెక్టర్ సూర్యతేజ



నరసాపురం వైఎన్ కళాశాలలో యువ ఉత్సవ్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం రూరల్: నవభారతం యువతతోనే సాధ్యమని వారి చేతుల్లోనే దేశ భవిత ఉందని నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, వైఎన్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన యువ ఉత్సవ్–2023 కార్యక్రమం స్థానిక వైఎన్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యువశక్తిని మనం సరైన దారిలో ఉపయోగించడం ద్వారా భారతదేశాన్ని అగ్రగామిగా నిలపవచ్చన్నారు. యువత వారి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకుని వారి ప్రతిభను ప్రదర్శించడానికి ఇలాంటి యూత్ ఉత్సవాలు చక్కటి వేదికలని తెలిపారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన వైఎన్ కళాశాల విద్యార్థులకు చదువుతోపాటు ఇతర కళలను కూడా ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసి వారిలో ఉత్తేజం నింపడానికి ఈ ఉత్సవాలు చక్కని వేదిక అన్నారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఈ యువ ఉత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ సూర్యతేజ ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా యువకేంద్ర అధికారి దూలం కిషోర్, వ్యాఖ్యాత చక్రావధానుల రెడ్డప్ప ధవేజి, ఆర్‌వీ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు, కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కనకారావు, కమ్యూనిటీ సెంటర్ కో ఆర్డినేటర్ బీఎస్ఎస్‌వీ ప్రసాద్, యాకోబు, షేక్ అలీషా, రూప, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

మండలి చైర్మన్ మోషేన్ రాజు



కోలనపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న మోషేన్‌రాజు, పీవీఎల్ తదితరులు

కాళ్ల: ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు, ఓటు హక్కు కల్పించిన ఘనత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌దేనని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. కాళ్ల మండలం కోలనపల్లి పెదపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు, డీసీసీబి చైర్మన్ పీవీఎల్ నరసింహారాజులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఒక వర్గానికి చెందిన వాడు కాదని, అందరివాడని స్పష్టం చేశారు. పూర్వం రోజుల్లో ధనవంతులకు, అగ్రవర్ణాలకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అంబేడ్కర్ రాజ్యాంగం వల్ల అందరికీ ఓటు హక్కు కల్పించారని చెప్పారు. అందరికీ చదువుకునే హక్కు కల్పించారన్నారు. న్యాయబద్ధంగా ప్రతి ఒక్కరు సంపాదించుకునే హక్కును కల్పించారని స్పష్టం చేశారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పిల్లల్ని బాగా చదివించాలని తెలిపారు. అంటరానితనాన్ని రూపుమాపిన వ్యక్తి, అణగారిన వర్గాలకు రాజ్యాంగం వల్ల అన్ని అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ ఆలోచనల మేరకు ప్రతి పేదవారు చదువుకోవాలని ఆలోచనతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చదువుకు ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. ఏ ఒక్కరు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగకూడదనే లక్ష్యంతో అమ్మఒడి వంటి అనేక పథకాలు జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని ప్రజలకు తెలిపారు. కోలనపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలకు కమిటీ వారికి అభినందనలు తెలిపారు. సర్పంచ్ సూరిబాబు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, దళిత నాయకులు కోన జోసెఫ్, సొడదాసి గంగయ్య, ఎంపీటీసీ వేగేశ్న సత్యనారాయణరాజు, మాజీ ఎంపీటీసీలు వేగేశ్న నారాయణరాజు, రమేష్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరాజు, నాగరాజు, బంటుమిల్లి శామ్యూల్, మోకా సత్తిబాబు, ఓగిరాల శ్రీకాంత్ ఓగిరాల అబ్రహం, సంఘ పెద్దలు ఓగిరాల చిట్టిబాబు, బంటుమిల్లి అహరోను, జయరాజు పాల్గొన్నారు.

డ్రోన్ నిర్వహణపై ఉచిత శిక్షణ

ఉండి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే కార్యక్రమంలో భాగంగా ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ సర్వీస్‌పై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. శిక్షణ పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి పాసై 17 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. 90 రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆసక్తి గల అభ్యర్థులు వారి ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్‌లు, ఫొటో, ఈ మెయిల్, ఫోన్‌నంబర్‌తో ఈ నెల 10లోపు రిజిష్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర సమాచారం కోసం 9676099988 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జీజీహెచ్‌లో ఆధునిక వైద్య పరీక్షలు

- సర్వజన ఆసుపత్రిగా మార్పుతో అందుబాటులోకి సేవలు
- థైరాయిడ్ పరీక్షలకు ఆధునిక పరికరం సిద్ధం
- బ్లడ్ కల్చర్ సిస్టమ్‌కు చర్యలు





ఏలూరు జీజీహెచ్ ల్యాబ్‌లో థైరాయిడ్ పరీక్షల పరికరం, బ్లడ్ కల్చర్ పరీక్షలకు సంబంధించి ఆధునిక పరికరం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఆసుపత్రి.. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)గా అప్‌గ్రేడ్ అయ్యింది. ఏలూరు జిల్లా వాసుల చిరకాల కోరికైన ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏలూరులో ఏర్పాటు చేశారు. ఎంసీఐ అనుమతులతో ఈ ఏడాది ఎంబీబీఎస్ క్లాస్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకూ జిల్లా ఆసుపత్రిగా ప్రజలకు సేవలందించిన ఏలూరు హాస్పిటల్.. సర్వజన ఆసుపత్రిగా జిల్లా వాసులకు సేవలందించనుంది. అత్యాధునిక వైద్య చికిత్సలు, సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఒకవైపు ప్రభుత్వ అధికారులు ఆధునిక వైద్య సేవలు జనాలకు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. మెడికల్ కళాశాల భవనాలు, బోధనాసుపత్రి ఆధునీకీకరణకు సర్కారు ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోంది.

ప్రజలకు మెరుగైన వైద్య పరీక్షలు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల సాధారణ రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. ప్రతి రోజూ మూడు, నాలుగు వందల మంది రోగులు వివిధ రక్తపరీక్షలు, ఎక్స్‌రేలు, స్కానింగ్, రూ.వేలు ఖర్చు చేయాల్సిన ఎంఆర్ఐ స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. రోజు సగటున 50కు పైగా ఎంఆర్ఐ స్కాన్లు చేస్తున్నారు. గతంలో మెడాల్ సంస్థ టెస్ట్‌లకు కాంట్రాక్ట్ అప్పగించగా రోగులు నానాతంటాలు పడాల్సి వచ్చేది. కోట్ల నిధులు మెడాల్ సంస్థకు కట్టబెట్టే పరిస్థితి ఉండేది. కానీ నేడు సర్వజన ఆసుపత్రిగా అభివృద్ధి చెందుతోన్న దశలో అత్యాధునిక వైద్యపరీక్షలు ప్రజలకు చేరువయ్యాయి.

ఏలూరు జీజీహెచ్‌లో ఆధునిక పరికరాలు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు ప్రభుత్వం కొనుగోలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా థైరాయిడ్ హార్మోన్ టెస్ట్, సెల్ కౌంటర్, బ్లడ్ కల్చర్ సిస్టమ్, ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్, ఎల్క్ట్రోలైట్స్ టెస్టింగ్, ఆటోమేటెడ్ కోయాగ్యులేషన్ ఎనలైజర్, ఇలా ల్యాబ్‌ల్లో పలు రకాల ఆధునిక పరికరాలు సమకూర్చారు. ఈ సౌకర్యాల కల్పనకు ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సుమారుగా రూ.6.50లక్షల నిధులను మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇక పరీక్షలు చేసేందుకు కిట్లు, ద్రావణాలు ఏ మేరకు కావాలో ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. త్వరలో హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో కార్పొరేట్ హాస్పిటల్‌లో లభించే అన్ని పరీక్షలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

కిట్లు రాగానే థైరాయిడ్ పరీక్షలు

ఏలూరు జీజీహెచ్‌లో థైరాయిడ్ టెస్ట్ పరికరాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతంలో థైరాయిడ్ టెస్టింగ్ పరికరం లేదు. బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ కావటంతోనే ఈ పరికరం అందుబాటులోకి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. ఈ పరికరంతో పాటు కంపెనీ 96 కిట్లు అందించినా అవి ట్రయల్‌రన్ కోసం సరిపోయాయి. పరికరం పనితీరును కుక్షుణ్నంగా పరిశీలించారు. ఇక టెస్టింగ్ కిట్లు కోసం నివేదించారు., కిట్లు ప్రత్యేకంగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని, ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొనుగోలు చేసి అందజేస్తుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ తెలిపారు.

బ్లడ్ కల్చర్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు

కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే ఉండే బ్లడ్ కల్చర్ సిస్టమ్ పరికరం ఏలూరు జీజీహెచ్‌లోనూ ఏర్పాటు చేస్తున్నారు. నేటి కాలంలో ఇష్టారాజ్యంగా యాంటీబయాటిక్స్ మందులు వినియోగిస్తోన్న తరుణంలో రోగి ఏ మేరకు మందులు వేసుకోవాలో నిర్ధారిస్తారు. ఇలాంటి ఆధునిక పరికరం అతి తక్కువ ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో మాత్రమే అందుబాటులో ఉంది. సెల్ కౌంటర్ లేదా హీమోగ్రామ్, బ్లడ్ కల్చర్ పరికరాల రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వైద్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్

అత్యాధునిక ఫుల్లీ ఆటోమేటెడ్ ఎనలైజర్ పరికరం రోగులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ఈ పరికరం కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, లివర్ ఫంక్షన్ టెస్ట్ చేసేందుకు ఉపయోగపడుతుంది. వ్యయప్రయాసలకు ఓర్చి పేద రోగులు టెస్ట్‌లు చేయించుకునే పరిస్థితి లేకుండా, ఈ ఆధునిక పరికరంతో ఉచితంగా సేవలు పొందే అవకాశం ఉంటుంది.

ప్రజలకు ఆధునిక వైద్య సేవలు



ఏలూరు బోధనాసుపత్రిలో ప్రజలకు మెరుగైన ఆధునిక వైద్య సేవలు, చికిత్సలు, పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ దృష్టికి తీసుకువెళ్ళి, త్వరలోనే అన్ని ఆధునిక పరికరాలు వినియోగంలోకి తీసుకువస్తాం. ప్రస్తుతం గతంలో మాదిరిగానే ల్యాబ్ పనిచేస్తోంది. ప్రభుత్వం సమకూర్చిన ఆధునిక పరికరాలతోనూ రోగులకు మరింత ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.
– డాక్టర్ ఎం.శశిధర్, సూపరింటెండెంట్, ప్రొఫెసర్, మైక్రో బయాలజీ

నూజివీడు ఆస్పత్రికి సర్వ హంగులు

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు గతంలో కంటే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. 2019 వరకు ఆసుపత్రిలో వైద్యులు కేవలం ఏడుగురు మాత్రమే ఉండగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రిలకు అధిక ప్రాధాన్యనివ్వడంతో ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 14 మంది వైద్యులు పనిచేస్తున్నారు. వీరిలో జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనకాలజిస్టు, డెంటల్, కంటి, చిన్నపిల్లల స్పెషలిస్టులు పనిచేస్తున్నారు. అంతేగాకుండా ఏరియా ఆసుపత్రి ఆవరణలో రూ.21.25 కోట్లతో అన్ని వసతులతో కూడిన మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు.

ల్యాబ్‌లో ఆధునిక పరికరాల ఏర్పాటు

గత ప్రభుత్వ హయాంలో ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఏ పరీక్షలు చేసేవారు కాదు. మెడాల్ ల్యాబ్‌కు పంపించేవారు. అక్కడి నుంచి పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు రెండు, మూడు రోజుల వరకు వచ్చేవి కావు. జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆసుపత్రిలోనే ల్యాబ్ ఏర్పాటు చేసి ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. ఆటో ఎనలైజర్ అనే లేటెస్ట్ టెస్టింగ్ మెషీన్లను ఏర్పాటు చేయడంతో రిపోర్టులను రోగులకు నిమిషాల్లో అందిస్తున్నారు. వైద్యులు ఈ రిపోర్టుల ఆధారంగా అంతే వేగంగా సేవలు అందిస్తున్నారు. ఈ ఆటో ఎనలైజర్‌ను రూ.20 లక్షలతో నెలకొల్పారు. దీంతో పాటు ఎరిత్రోసైట్స్ సెడిమేంటేషన్ రేట్ ఎనలైజర్, ఎల్క్ట్రోలైట్స్ ఎనలైజర్, కాగులేషన్ ఎనలైజర్ తదితర అధునాతన మెషీన్లను ఏర్పాటు చేశారు.

రాయలం ఆక్రమణలపై కదిలిన యంత్రాంగం



రాయలం డ్రైయిన్ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఆక్రమణ చెరలో రాయలం డ్రైయిన్ అనే శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కదిలింది. మున్సిపల్, డ్రైనేజీ, టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం నుంచి ఆక్రమణలు గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గారు, టౌన్ సర్వేయర్ రమబాయ్ డ్రెయిన్‌ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణలు ఎంతవరకు ఉన్నాయే అక్కడి వరకు మార్కింగ్ చేసి ఆక్రమణలకు సంబంధించి రఫ్ స్కెచ్‌ను డ్రైనేజి డిపార్ట్‌మెంట్‌కు అందజేస్తామని తదుపరి సంయుక్తంగా ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య



తానేటి యోబు మృతదేహం

పెనుగొండ : సిద్ధాంతంకు చెందిన తానేటి యోబు(62) మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెనుగొండ పోలీసులు కథనం ప్రకారం.. యోబు మంగళవారం రాత్రి మద్యంలో పురుగుల మందు కలుపుకొని సేవించాడు. దీనిని గమనించిన అల్లుడు మోహనరావు కుమారుడు సురేష్‌కు సమాచారం అందించారు. దీంతో 108లో తణుకు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ప్రైవేటు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పొందుతూ బుధవారం మృతి చెందాడు. గత కొంతకాలంగా గుండె జబ్బుతో బాధపడుతోన్న యోబు ఇటీవల మద్యం సేవించడం అధికమైందని, ఈ కోవలోనే మద్యంలో పురుగుల మందు సేవించి ఉంటాడని, ఇతర కారణాలు తెలియరాలేదని కుమారుడు సురేష్ తెలిపారని పోలీసులు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హౌసింగ్ 'గూడెం' సబ్ డివిజన్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



విజయవాడలో హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: గృహ నిర్మాణ శాఖ తాడేపల్లిగూడెం సబ్ డివిజన్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రగతి అవార్డు లభించింది. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలో చీఫ్ ఇంజినీర్ డీవీ ప్రసాద్ చేతుల మీదుగా బుధవారం డీఈ కేవీవీఎస్ ప్రసాద్ అందుకున్నారు. గృహ నిర్మాణ ప్రగతిలో తనకు సహకరించిన ఏఈలకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దుండగుడికి దేహశుద్ధి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ సామగ్రి చోరీ చేస్తున్నాడన్న ఆరోపణతో దుండుగుడిని విద్యుత్ స్తంభానికి కట్టేసి స్థానికులు దేహశుద్ధి చేశారు. కొంతకాలంలో ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న సామగ్రి, తలుపులు, మెస్ వంటివి చోరీకి గురవుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం కాలనీలోని ఒక ఇంటి తలుపు చోరీ చేస్తుండగా ఒక వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీనిపై రూరల్ పోలీసులను సంప్రదించగా, ఫిర్యాదు వచ్చిందని, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జూనోసిస్ వ్యాధులతో జాగ్రత్త



- పశువుల ఆస్పత్రుల వద్ద ఉచితంగా రేబీస్ టీకాలు
- వ్యాధులపై అవగాహన కలిగిస్తున్న ప్రభుత్వం

నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

కైకలూరు/జంగారెడ్డిగూడెం : జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సోకే వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అంటారు. లూయిస్ పాశ్చర్ శాస్త్రవేత్త మొదటిసారిగా 1885 జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి టీకా వేసి పునర్జన్మ ఇచ్చిన సందర్భంగా ప్రతి ఏటా జూనోసిస్ డేను నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 280 రకాల జూనోసిస్ వ్యాధులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం అంటు వ్యాధుల్లో జూనోసిస్ వ్యాధులు 60 శాతం ఆక్రమించి ఉన్నాయని అంచనా. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జూనోసిస్ వ్యాధులపై అవగాహన కలిగిస్తోంది. ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబరు 155251ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూనోసెస్ డే రోజున పెంపుడు జంతువులకు ఉచిత రేబీస్ టీకాలను వేస్తున్నారు.



పందిరిపల్లిగూడెంలో ఉచితంగా రేబీస్ టీకా వేస్తున్న డాక్టర్ ఫణి (ఫైల్)

ప్రధానంగా వ్యాపించే వ్యాధులు

జూనోసిస్ వ్యాధుల్లో ముఖ్యమైనవి రేబిస్, జపనీస్ ఎన్‌సైఫిలైటిస్ (మెదడువాపు), వైరల్ హైపటైటీస్, అమ్మవారు, డెంగీ, కొక్కెర, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్యాట్ స్కాచ్ డిసీజ్, లెప్టో స్పైరోసిస్, సాల్మనెల్లోసిస్, కారిఫెల్లో బ్యాక్టీరియోసిస్, కొలి బాసిల్లోసిస్, లిస్టిరియోసిస్, షెగోల్లోసిస్, స్టెఫలోకోకోసిస్, ట్యూబర్‌క్యూలోసిస్, తామర, అమీబియాసిస్, బాలంటీడియోసిస్, జియార్డయాసిస్, సార్కోసిస్టోసిస్, టాక్సోప్లాస్మోడిస్, పారాసైటిక్ జూనోసిస్, టీనియాసిస్, డైఫిల్లో బాత్రియాసిస్, సెన్యూరియాసిస్, ట్రిచినెల్లోసిస్, అంకై లోస్టోమియాసిస్, అస్కారియాసిస్, స్ట్రాంగైలాయిడియోసిస్, ఫైలేరియాసిస్, డ్రాంకకులోసిస్ (నారికురుపు), ఫేసియోలియాసిస్, పారగోనిమియాసిస్, సిస్టోసోమియాసిస్, స్కేబీస్ (గజ్జి) వంటివి.

కారణాలు

వాతావరణ కాలుష్యం, జీవనోపాధికి మనుషులు వివిధ ప్రాంతాల్లో సంచరించడం, కలుషితనీరు, ఆహారం తీసుకోవడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు (పచ్చిమాంసం, సరిగా ఉడకని మాంసం తినడం), వృత్తిరీత్యా పశువులు, పశు ఉత్పత్తుల పరిశ్రమల్లో పనిచేసే వారికి జూనోటిక్ వ్యాధులపై అవగాహన లేకపోవడం, వ్యాధి నిర్ధారణకు సరైన సౌకర్యాలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, వ్యక్తిగత అపరిశుభ్రత, పారిశుధ్య లోపం, పెంపుడు జంతువుల పోషణలో లోపాలు తదితర కారణాల వల్ల జూనోటిక్ వ్యాధులు ప్రబలుతాయి.

ఏలూరు జిల్లాలో ఇలా..

ఆవులు	1,36,549	గొర్రెలు	5,26,836
కుక్కలు	22,612	మేకలు	1,98,810
గేదెలు	5,12,142	పందులు	7,646



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి.
- మరగకాచిన పాలను, బాగా ఉడకబెట్టిన మాంసం మాత్రమే తినాలి.
- కలుషిత నీటిని, పాడైన ఆహారం తీసుకోకూడదు.
- ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రతగా ఉంచుకోవాలి.
- పశువుల కొట్టం చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- పిడుదులు, గోమార్లు, పేల నిర్మూలనకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- పెంపుడు జంతువులకు జూనోసిస్ వ్యాధులు రాకుండా సకాలంలో టీకా వేయించాలి.
- వ్యాధి సోకిన పశుపక్షాదులను మంద నుంచి వేరుచేసిన వెంటనే చికిత్స చేయించాలి.

అవగాహన అవసరం



పెంపుడు జంతువులతో యజమానులు జాగ్రత్తగా ఉండాలి. క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ప్రతి ఏటా పశుసంవర్ధక ఆస్పత్రుల వద్ద కుక్కలకు రేబీస్ టీకాలను ఉచితంగా అందిస్తున్నాం.

– డాక్టర్ పఠాన్ ముస్తాఫాఖాన్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, కైకలూరు

వ్యాధులను నివారించవచ్చు



జూనోసిస్ వ్యాధులు చాలా రకాలుగా గుర్తించినప్పటికీ ఎక్కువ వ్యాధులతో ప్రమాదం తక్కువగా ఉంటుంది. ప్రజల్లో ఆరోగ్య విజ్ఞానంపై అవగాహన అవసరం. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, రక్షిత మంచినీరు, పెంపుడు జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పోషించాలి.

– టీఎస్‌వీ శేఖర్‌దొర, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యశాల

హరిరామజోగయ్యా నీకిది తగునా!

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య రాసిన బహిరంగ లేఖను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై రాసిన రాతలు మాజీ పార్లమెంట్ సభ్యుడిగా, సీనియర్ రాజకీయ నాయకుడిగా హరిరామజోగయ్యకు ఉన్న హుందాతనాన్ని దిగజార్చేవిగా ఉన్నాయని వివరించారు. రాజకీయాల్లో ఉండే వ్యక్తుల వ్యక్తిగత జీవితం కూడా అందరూ మెచ్చే విధంగా ఉండాలనే విషయాన్ని గుర్తుచేశారు. కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహన రంగా హత్యలో టీడీపీ నేత చంద్రబాబు హస్తం ఉందని హరిరామజోగయ్య తన ఆత్మకథ పుస్తకంలో రాసిన విషయం మరచిపోయారా?, అదే టీడీపీ నేతతో జతకడుతున్న పవన్ కల్యాణ్‌కు కాపు సంక్షేమ సేన తరపున మద్దతుగా నిలవడం యావత్ కాపు జాతిని మోసం చేసినట్టు కాదా అని ప్రశ్నించారు. కాపు సంక్షేమ సేనను ఒక రాజకీయ పార్టీగా మార్చి సమాజానికి ఏ సమాచారం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. పవన్ కల్యాణ్‌పై అంత ప్రేముంటే కాపు సంక్షేమ సేనకు స్వస్తిచెప్పి జనసేనలో చేరిపోవాలని హితవుపలికారు. కాపు యువత ఎంతో సున్నిత మనస్కులని రెచ్చగొట్టే వ్యాఖ్యలు, రాతలతో వారిని తప్పుదోవ పట్టించి కాపుజాతిని ఇబ్బందులపాలు చేయవద్దని సూచించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, కాపు నాయకులు మారిశెట్టి శివశంకర్, ములగాల శ్రీనివాస్, పుల్లెపు సూరిబాబు, బీసీ నాయకులు సామంతుల అప్పారావు, షేక్ బాజీ పాల్గొన్నారు.



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

చురుగ్గా ఫేజ్-2 భూముల రీ సర్వే

- 12 మండలాల్లోని 93 గ్రామాల్లో పనులు
- మొత్తం 1,18,950 ఎకరాల సర్వే
- డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా కసరత్తు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా ఫేజ్–2 రీ సర్వే ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలోని 12 మండలాల్లోని 93 గ్రామాల్లో ఫేజ్–2 సర్వే చేపట్టగా 93 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై, ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజస్ ప్రక్రియ పూర్తి చేశారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి ఫొటోలు కూడా రావడంతో భూములను వేగంగా సర్వే చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఫేజ్–2 రీ సర్వే పూర్తి చేయడానికి అధికారులు అన్ని రకాల ప్రణాళికలు రూపొందించారు.

ఫేజ్–2లో 1,18,950 ఎకరాల సర్వే

జిల్లాలో చేపట్టిన ఫేజ్–2లో మొత్తం 1,18,950 ఎకరాలు సర్వే చేస్తున్నారు. అందులో ప్రైవేటు భూమి 1.15 లక్షల ఎకరాలు కాగా, ప్రభుత్వ భూమి 3,950 ఎకరాలకు సర్వే నిర్వహించనున్నారు. సర్వే పూర్తి చేసి సుమారు 66,527 మంది రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తారు.

ఫేజ్–1లో 16 గ్రామాల సర్వే

జిల్లాలో చేపట్టిన భూ రీ సర్వేలో భాగంగా ఫేజ్–1లో 16 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. 6,187 మంది రైతులకు 5,656 జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పత్రాలను అందించారు.

ఆధునిక పరికరాలతో..

భూముల రీసర్వేకు సర్వే శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి సర్వే పనులు చేస్తున్నారు. భూముల సర్వే పనులకు సంబంధించి ఆధునిక పరికరాలైన డ్రోన్, రోవర్ వంటి ఆధునిక పరికరాలు ఉపయోగిస్తున్నారు. ముందుగా సర్వే చేస్తున్న గ్రామాల్లోని భూములపై డ్రోన్ ఫ్లై చేసి ఇమేజ్ సేకరిస్తారు. ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజస్ కోసం రోవర్ ఉపయోగిస్తున్నారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి నమూనా వచ్చిన తర్వాత భూముల సర్వే చేసి వేగంగా సరిహద్దు రాళ్లను ప్రభుత్వమే ఉచితంగా పాతిస్తుంది.



ఉండి మండలంలో భూములను సర్వే చేస్తున్న సిబ్బంది

98 ఏళ్ల తర్వాత..

98 ఏళ్ల క్రితం బ్రిటీష్ పాలకులు భూములు సర్వే చేసి వ్యవసాయం, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములుగా విభజించి వాటిని రికార్డులకు ఎక్కించారు. అప్పటి నుంచి భూముల రీసర్వే జరగలేదు. ఏళ్ల తరబడి ఉన్న రికార్డులు పాడవడం, భూములకు సంబంధించి వివరాలు లభించడం కష్టంగా మారింది. దీంతో భూముల విస్తీర్ణం విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడే వారు. దీనిపై దృష్టి పెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీసర్వే కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉచితంగా భూముల రీ సర్వే చేయించడం, సర్వే చేయించిన భూముల చుట్టూ కొలతల ప్రకారం సర్వే రాళ్లు ఉచితంగా వేయించి రైతుల మధ్య భూ సమస్యలు లేకుండా, అలాగే మాయమైన భూములను మళ్లీ తిరిగి పొందేలా మేలు చేస్తున్నారు. దీంతో ఎప్పటినుంచో ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అన్యాక్రాంతమైన దేవాలయ భూములు, గ్రామ కంఠం భూములు బయటపడుతున్నాయి.

జిల్లాలో ఫేజ్-2 సర్వే వివరాలు

మండలం	రైతులు	సర్వే చేయనున్న ఎకరాలు
తాడేపల్లిగూడెం	6,376	11,873.17
పెంటపాడు	8,796	15,596.54
అత్తిలి	7,525	12,084.47
పెనుగొండ	6,068	7,196.73
పాలకొల్లు	4,339	5,743.83
వీరవాసరం	7,510	11,320.09
ఉండి	5,539	13,117.98
పాలకోడేరు	8,021	12,657.17
కాళ్ల	2,430	8,214.45
గణపవరం	5,438	10,814.71
ఆకివీడు	3,714	9,148.98
తణుకు	771	1,182.54

సర్వేలో సమస్యలు ఉంటే దరఖాస్తు చేయవచ్చు



భూముల రీ సర్వేకు సంబంధించి ఫేజ్–2 వేగంగా సాగుతోంది. సర్వే చేపట్టిన 93 గ్రామాల్లో ముందు చేసే డ్రోన్ ఫ్లైతో పాటు అన్ని పనులు పూర్తి చేసి సర్వే చేస్తున్నాం. ఈ సర్వేలో సర్వే, రెవెన్యూ సంబంధిత శాఖల నుంచి 558 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 20 మండలాల తహసీల్దార్లు సర్వేలో పాల్గొని సర్వేకు సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తున్నారు. సర్వేలో రైతులకు సమస్యలు ఉంటే ప్రతి మండలంలో మొబైల్ మెజిస్ట్రేట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

– జాషువా, జిల్లా సర్వే అధికారి

గడపగడపకూ సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

మిస్టరీగానే బాలుడి అదృశ్యం



ఎర్రవరంలో బాలుడి ఆచూకీ కోసం సమాచారం సేకరిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలో ఉన్న కొత్త సరుగుడు గ్రామంలో అదృశ్యమైన సూర్యతేజ (11) కేసు మిస్టరీగానే ఉంది. ఎనిమిది పోలీస్ బృందాలు అనువణువుగా గాలింపు చర్యలు చేపట్టాయి. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. మంగళవారం పోలీస్ డాగ్‌ను రంగంలోకి దించినప్పటికీ అది గ్రామంలోనే చుట్టూ తిరిగి మళ్లీ బాలుడు అదృశ్యమైన ఇంటికి వచ్చింది. పోలీసులు కొత్త సరుగుడు గ్రామ సమీపంలో, జల్లేరు జలాశయం డ్యామ్‌తో పాటు దొరమామిడి సమీపంలోని చెరువు చుట్టుపక్కల కూడా పరిశీలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించలేదు. బాలుడు జీలుగుమిల్లి మండలం సమీపంలో నిర్మించిన ఎర్రవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన ఎర్రవరం వెళ్లి విచారణ చేశారు. అక్కడి బాలుడి వయస్సు కూడా ఏడాది వయస్సు కావడంతో కొత్త సరుగుడుకు చెందిన ఇద్దరు మహిళలు అక్కడ ఉన్నారని తెలియడంతో అతనే సూర్యతేజ అయి ఉండవచ్చని భావించారు. తీరా అక్కడికెళ్లి చూడగా ఆ బాలుడు సూర్యతేజ కాదని పోలీసులు నిర్ధారించుకున్నారు. ఇటీవల జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో బాలిక అదృశ్యం కేసు గంటల వ్యవధిలోనే చేదించిన పోలీసులకు బాలుడి అదృశ్యం ఛాలెంజ్‌గా మారింది.

మహిళ అనుమానాస్పద మృతి

పెదవేగి : దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. పెదవేగి మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన పలగాని శ్రీదేవి (40) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుందన్నారు. ఈనెల 5న అకస్మాత్తుగా మరణించిందని భర్త నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కాలువలో శిశువు మృతదేహం లభ్యం

ఉంగుటూరు: ఏలూరు కాలువలో రెండురోజుల వయసున్న శిశువు మృతదేహాన్ని చేబ్రోలు వద్ద బుధవారం గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో సుబ్రహ్మణ్యేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై స్వామి తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు



భీమవరంలో గంజాయి కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరంలో గంజాయి కలిగిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్పీ యు.రవి ప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక టుటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భీమవరం బైపాస్‌రోడ్డులోని ఐటీఐ కళాశాల సమీపంలో గంజాయి కలిగి ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పోర్చలబ్బురు గ్రామానికి చెందిన అరబీరు విజయకుమార్, పాలకొల్లు పట్టణం శంభునిపేటకు చెందిన మొల్లం పవన్‌కుమార్, భీమవరం పట్టణం దుర్గాపురం ప్రాంతానికి చెందిన గూడూరి దుర్గాప్రసాద్, పోట్నూరి గణేష్‌లను అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల నుంచి సుమారు 21 కిలోల గంజాయి, రూ.21 వేలు, నాలుగు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. కొత్త జిల్లా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 52 గంజాయి కేసులను నమోదుకాగా, 236 మందిని అరెస్టు చేశామని వివరించారు. ఈ కేసుల్లో ఎక్కువగా యువత, విద్యార్థులు ఉంటున్నారని తెలిపారు. జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా చేయడానికి పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఈ కేసును చేధించిన డీఎస్పీ బండారు శ్రీనాథ్, టూటౌన్ సీఐ బి.కృష్ణకుమార్, ఎస్సై వి.రాంబాబు, సిబ్బందిని ఎస్పీ రవిప్రకాష్ అభినందించారు.

ఉత్తమ నాటికగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విశాఖపట్నానికి చెందిన తెలుగు కళా సమితి సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక ఉత్తమ ప్రథమ ప్రదర్శనతో పాటు అనేక బహుమతులను గెలుచుకుంది. ఈ నెల 1వ తేదీ నుంచి 4 వరకు ఏలూరు నగరానికి చెందిన హేలాపురి కళా పరిషత్, హిందూ యుజవన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీల్లో ఉత్తమ నాటికలు, కళాకారులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా పొన్నూరుకు చెందిన రసఝరి సంస్థ ప్రదర్శించిన కాపలా నాటిక, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా కొలకలూరుకు చెందిన శ్రీ సాయి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ప్రేమతో నాన్న నాటిక ఎంపికయ్యాయి. తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ సంస్థ ప్రదర్శించిన వెండి అంచులు ప్రత్యేక జ్యూరీ అవార్డు గెలుచుకుంది. ఉత్తమ నటునిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి పి.వరప్రసాద్, ద్వితీయ ఉత్తమ నటుడిగా ప్రేమతో నాన్న నాటిక నుంచి పి.విజయ కుమార్, ఉత్తమ నటిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక నుంచి డి.హేమ, ద్వితీయ ఉత్తమ నటిగా ప్రేమతో నాన్న నాటిక నుంచి సురభి ప్రభావతి ఎంపికయ్యారు. జీఎస్‌డీ కుసుమ సాయి, ఈటీ రాంబాబు, యార్లగడ్డ బుచ్చయ్య చౌదరి, వసంతయామిని, జీవీ మనోహర్‌లకు ప్రత్యేక ప్రశంసా బహుమతులు లభించాయి. ఉత్తమ ప్రతినాయకునిగా వెండి అంచులు నాటికలో రఘురామ్ పాత్రధారి వీవీ స్వామి నిలిచారు. ఉత్తమ రంగాలంకరణ రాము, ఉత్తమ ఆహార్యం థామస్, ఉత్తమ సంగీతం లీలా మోహన్, ఉత్తమ రచన పీటీ మాధవ్ (నిశ్శబ్దమా నీ ఖరీదెంత), ఉత్తమ దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు (కాపలా) బహుమతులు గెలుచుకున్నారు.



నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మన పథకాలు దేశానికే ఆదర్శం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగ్గన్నపేటలో గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం


జగ్గన్నపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. రాబోయే తొమ్మిది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, దుర్మార్గులు వస్తారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హితవు పలికారు. బుధవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో ఐదేళ్ల చంద్రబాబు పాలనను ప్రజలు తిరస్కరించారన్నారు. మంచి సమయంలో రాష్ట్ర ప్రజలు ఒక మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. నాడు ప్రజలు వేసిన ఓటుకు విలువనిచ్చి జగన్ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. నాడు తీసుకున్న నిర్ణయం కారణంగా రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. చిన్నారుల విద్య నుంచి రైతులను, మహిళలను సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో ఏనాడూ రాజకీయ జోక్యం లేదన్నారు. పేదరికమే ప్రాతిపదికగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నేడు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే గర్వంగా భావిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. పిల్లలు సంతోషంగా ఉంటే కుటుంబానికి సగం బలం అన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేక పచ్చమీడియాలో అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆ వార్తలు సరైనవి కావని ప్రజలు తెలుసునన్నారు. మరో పక్క పవన్ చంద్రబాబు ఇచ్చే కిరాయికి పనిచేస్తున్నాడని విమర్శించారు. సినిమా ఖ్యాతిని అడ్డం పెట్టుకుని పవన్ రాజకీయాల్లోకి వచ్చి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల్లో చచ్చిపోయిన పార్టీ తెలుగుదేశమని వ్యాఖ్యానించారు. సమాజంలో అవినీతి లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. తొలుత సచివాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుకుమాటి శేషలత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, సర్పంచ్ ములకాల సూర్యారావు, రామన్నగూడెం సర్పంచ్ చింతా వెంకట్రావు, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్. శ్రీనివాస్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, వాణి, మండల పరిషత్ ఏవో ఆర్.సుజాత, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ల తాతారావు, పరిమి తులసీదాస్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, ములకాల రాంబాబు, పచ్చా అంజిబాబు, పోలిమోను శ్రీనివాస్, మద్దుకూరి రామావతారం, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయ హోమం


కృష్ణ యోగ ధ్యాన మందిరంలో దత్తాత్రేయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధవారం ఉదయం నిత్యార్చనలు, అనంతరం శ్రీ లక్ష్మీగణపతికి, శ్రీదత్తాత్రేయ స్వామి వారికి హోమాలు అర్చకులు ఎం.సూర్యనారాయణ బ్రహ్మత్వంలో ఘనంగా జరిగాయి. గణేశ పూజ, దత్తాత్రేయ స్వామికి అష్టోత్తర శత నామాలతో విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దగ్గుపాటి పురందేశ్వరికి అభినందనలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): బీజేపీ ఏపీ రాష్ట్ర నూతన అధ్యక్షురాలిగా నియామకమైన దగ్గుపాటి పురందేశ్వరికి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట నరసింహమూర్తి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, ఇంటలెక్చువల్ సెల్ కన్వీనర్ చిట్యాల రాంబాబులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన


ఇరగవరంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన తెలుపుతున్న దృశ్యం

ఇరగవరం: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇరగవరం సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కేతా గోపాలం, ప్రతాప్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలన్నారు. అనంతరం విద్యుత్ ఏఇకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు తామరపల్లి మునలియ్య, ఇల్లిందలపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ఆర్‌ఓ ప్లాంట్ వద్ద మంచినీరు తాగుతున్న పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

పెంటపాడు: మండలంలోని పెంటపాడు పోస్ట్ బేసిక్ స్కూల్‌లో దాతలు గణపవరం మండలం వెలగపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ జూపల్లి అనిల్ కుమార్ సౌజన్యంతో ఆర్ఓ ప్లాంట్‌ను నిర్మించగా, ఆయన తండ్రి జూపల్లి వీరభద్రరావు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 500 మంది విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి తాగునీరు అందించడం ఎంతో పుణ్యంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజేష్, పాఠశాల టీచర్ లక్ష్మీనారాయణ, వెలగపల్లి ప్రజా ప్రతినిధులు తాడేపల్లి సూర్యచంద్రకుమారి, డి.శ్రీనివాస్, రెడ్డి సూరిబాబు, ఎస్.అంజిరెడ్డి, , కే.విజయభాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా బలుసులమ్మకు ఆషాఢం సారె సమర్పణ


బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ వారికి ఈనెల 6వ తేదీ గురువారం ఆషాఢం సారె సమర్పిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద నుంచి మేళ తాళాలు, వేదమంత్రాలు, కోలాటం భజనలతో శాస్త్రోక్తంగాను, సాంప్రదాయబద్ధంగా ఊరేగింపు బయలుదేరుతుందని, బలుసులమ్మ ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి ఆషాఢం సారె సమర్పిస్తారని తెలిపారు. మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీటీఎస్ కౌన్సిలర్ యార్లగడ్డ బాబూరావు

తాడేపల్లిగూడెం అర్బన్ : నేటి యువత హెచ్ఐవి వ్యాధిపై అవగాహనతో ఉండాలని ఐసీటీఎస్ కౌన్సిలర్ యార్లగడ్డ బాబూరావు తెలిపారు. స్థానిక గుడ్ ల్యాంప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో యాగర్లపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో బుధవారం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి చాపకింద నీరులా వ్యాపిస్తుందని చెప్పారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తరచూ జ్వరం రావడం, శ్రమ ఎక్కువగా ఉన్న పనులు చేసిన సమయంలో తక్కువ సమయంలో నీరసం వంటి లక్షణాలు కలిగి అనుమానం వ్యక్తమైతే తాడేపల్లిగూడెంలోని ఐసీటీసీ సెంటర్ నందు ఉచిత రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్ఐవి వ్యాధి సోకిన వారికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మందులు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. నేటి యువత బాధ్యతయుతంగా ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు నడుం కట్టాలని అభిలషించారు. గుడ్‌ల్యాంప్ సొసైటీ సిబ్బంది అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ఓ సతీష్, పీడీ టిఎస్ సుకుమార్, గుండ్ ల్యాంప్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కుక్కలకు ఉచిత టీకాలు

అత్తిలి: జూనోసిస్ డే సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి వారి సహకారంతో ప్రాంతీయ పశు వైద్యశాలలో గురువారం ఉదయం నుంచి పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయడం జరుగుతుందని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె నరశింహరావు తెలిపారు. కుక్కల పెంపకందారులు అత్తిలి పశువైద్యశాలకు తీసుకువస్తే కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తామన్నారు. రేబిస్ అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాధిఅని, సకాలంలో టీకాలు వేయించకపోతే కుక్కలు ఈవ్యాధి బారినపడే అవకాశం ఉందన్నారు. రేబిస్ వచ్చిన జంతువుల నుంచి మనుషులకు ఈవ్యాధి సోకి మరణం సంభవిస్తుందన్నారు. ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి


ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ధన్యవాదాలు చెబుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారయణను బుధవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలని అంటూ ఈ సందర్భంగా మంగరాజును అభినందించారు. మంగరాజు మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కృతజ్ఞతలు వెల్లడించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ బాధితులకు రావాలిసిన నష్ట పరిహారం కల్పించాలని, ఎస్సీలు, ఎస్టీలపై దాడులు జరిగితే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. సత్వరం న్యాయం జరిగే విధంగా తన వంతుగా కృషి చేస్తానన్నారు. విజిలెన్స్ కమిటీలో పనిచేయడం సంతోషంగా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పెంటపాడు మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర ప్రిబాబు పాల్గొన్నారు.

7న మండలస్థాయి 'అమ్మ ఒడి' పథకం ప్రారంభ కార్యక్రమం


అత్తిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

అత్తిలి: ఈనెల 7వ తేదీన అత్తిలి బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే మండల స్థాయి జగనన్న అమ్మ ఒడి ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేవిధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారులు ఎస్ రమేష్, ఎంవీఎల్ కేశవ ప్రసాద్ చెప్పారు. బుధవారం అత్తిలి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల స్థాయిలో జరిగే జగనన్న అమ్మ ఒడి కార్యక్రమానికి పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అమ్మ ఒడి లబ్ధిదారులైన అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తప్పక హజరయ్యేటట్లు చూడాలని ఎంఈఓలు రమేష్, ప్రసాద్ చెప్పారు.

నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: సార్వా సాగులో నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరంలో వ్యవసాయ కార్యాలయంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు సార్వా సాగులో ముందుగా మేల్కొని వరినాట్లు పూర్తి చేస్తే పంటను రక్షించుకోవచ్చన్నారు.

పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని పడాల గ్రామంలో జీవన సంధ్య వృద్ధాశ్రమంలో రజక సంఘం నాయకులు, వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు అడ్డాల నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఎ.శ్రీదేవి, వెంకటలక్ష్మి, పైడారం , రజక సంఘం ఉపాధ్యక్షుడు యండమూరి మహేష్, అడ్డాల అప్పారావు, హేమ ప్రవీణ్, గణేష్, చిటికెన సురేష్, ఎ.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



సచివాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): రైతులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని వెంటనే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావులు అన్నారు. రైతు సమస్యలపై పట్టణంలోని మూడో వార్డు సచివాలయం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించి కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కౌలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రతి ఎకరాకు రూ. 10,000 సాయం అందించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లం రాము, ఎం.త్రిమూర్తులు, పురందాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయలు

- ఠారెత్తిస్తున్న టమోటా ధర
- కన్నీరుపెట్టిస్తున్న మిర్చి
- వినియోగదారులు బెంబేలు


గూడెం మార్కెట్‌లో మదనపల్లి టమోటా


గూడెం మార్కెట్‌లో మిర్చి బస్తాలు

పెంటపాడు: తెలుగు రాష్ట్రాల్లో ప్రజానీకం ఉల్లి తరువాత అత్యధికంగా వినియోగించే టామోటా ధర మార్కెట్‌లో భేజారెత్తిస్తోంది. శాఖాహారం, మాంసాహారం అనే భేదం లేకుండా అతితక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండి, ప్రతివారు ఇష్టపడే టమోటా ధర అమాంతం గత వారం రోజుల నుంచి పెరిగిపోవడంతో వినియోగం కూడా తగ్గింది. గతంలో మార్కెట్‌లో రోజుకు 4 లోడులు దిగే టమోటా, దిగుబడి లేక రెండు లోడులకు పడిపోయింది. టమోటా లేకుండానే నిర్వాహకులు ఫాస్ట్‌ఫుడ్ తయారీ చేస్తున్నారు. పలు హోటల్‌ల్లో టామోటా వినియోగం తగ్గింది. అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో టమోటా హోల్‌సేల్‌గా రూ.90 ఉండగా రిటైల్‌గా బహిరంగ మార్కెట్‌లో 110–120 పలుకుతోంది. నెల రోజుల వ్యవధిలోనే రూ. 30 నుంచి రూ.120 పెరగడంతో వినియోగదారులు విస్తుపోతున్నారు. ఈ ఏడాది సుదీర్ఘంగా వేసవిఎండలు ఉండటంతో పంటలు ఎండిపోయి సరఫరా తగ్గిపోయింది. రోజురోజుకూ టమోటా ధర పెరుగుతూ వస్తోంది. అలాగే మే తొలివారంలో కురిసిన భారీ వర్షాలవల్ల పూత, పిందె రాలిపోవడంతో తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత ఉష్ణోగ్రత పెరగడంతో తోటలు ఎండిపోయి ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో రాష్ట్రంలోనే అత్యధికంగా టమోటా పండించే కర్నూలు, అనంతపురం, మదనపల్లి, చిత్తూరు మార్కెట్ల నుంచి సరఫరా ఒక్కసారిగా నిలిచిపోయింది. అధికధరల వల్ల గతంలో జాతీయ మార్కెట్‌లో సుమారు వంద టన్నుల వ్యాపారం జరిగే ప్రాంతంలో నేడు కేవలం 20 టన్నులకే పరిమితమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో కోత, కూలీ రాని టమోటా నేడు సెంచరీ దాటినా స్థానిక రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. ధరలు పెరిగిన సమయంలో ఉత్పత్తి లేకపోవడం కూరగాయల రైతులకు శాపంగా మారింది. ప్రస్తుతం టమాటా ధర ఒక్కసారిగా పెరిగిపోవడంతో కొనుగోలు చేసే వారి సంఖ్య అమాంతం తగ్గిపోయింది. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ట్రేలలో ఉన్న కొద్దిపాటి టమోటా ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం లేక కుళ్లిపోయి తీవ్ర నష్టం మిగులుతుంది.

కొనుగోలు తగ్గిపోయింది



వారం రోజులు క్రితం కురిసిన వర్షాల వల్ల టమాటా పంట పాడైంది. ప్రధానంగా మదనపల్లి, చిత్తూరు ప్రాంతాల నుంచి నెంబర్–2 టమాటా మాత్రమే వస్తోంది. అయినా ధర ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం ఒక్క ట్రే రూ.21 వందలు ఉంది. దిగుబడి తగ్గడంతో రోజుకు 4 లోడ్‌లు వచ్చే టమాటాలు ప్రస్తుతం ఇక్కడ డిమాండ్‌ను బట్టి ఒకటిన్నర, రెండు లోడులు దిగుతున్నాయి.

– ఎస్. నాగరాజు, హోల్‌సేల్ వ్యాపారి, బ్రహ్మానందరెడ్డి మార్కెట్ 1

మిర్చికూడా అదే దారిలో ఉంది



వర్షాల కారణంగా మిర్చి ధర కూడా ఆకాశాన్ని అంటింది. గుంటూరు, ఒరిస్సా, ప్రాంతాల్లో పండే మిర్చి పిందె, పూత వర్షాలు, ఈదురుగాలులకు పాడవడంతో ధర కూడా అధికంగా ఉంది. రోజుకు ఒకలోడు మాత్రమే వస్తోంది. హోల్‌సేల్‌గా 1కేజీమిర్చి రూ. సుమారు 160 ఉంది.

– యింటి శ్రీనివాస్, మిర్చి వ్యాపారి, తాడేపల్లిగూడెం మార్కెట్

ఇప్పుడిప్పుడే ధరలు తగ్గే అవకాశం లేదు



ఇప్పుడే కర్ణాటకలో టమోటా తోటలు అందుబాటులోకి రావడంతో ఉత్పత్తి అంతంత మాత్రంగానే ఉంది. రాయలసీమ, ఉమ్మడి గోదావరి జిల్లాలలోని లంక ప్రాంతాల్లో పండించే టమోటా ఆగస్టులో అందుబాటులోకి వచ్చే వరకు ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొంటుంది.

– యాళ్ల మంగతాయారు, కూరగాయల వ్యాపారి, తాడేపల్లిగూడెం

ఏబీవీపీ బంద్ విజయవంతం


పట్టణంలో పాఠశాల వద్ద మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ పత్స గోపాలకృష్ణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): అఖిల భారతీయ పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తాడేపల్లిగూడెం శాఖ పర్యవేక్షణలో పట్టణంలో బుధవారం ప్రైవేట్ పాఠశాల బంద్ విజయవంతంగా జరిగిందని జిల్లా కన్వీనర్ పత్స గోపాలకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల విద్యలో నెలకొన్నటువంటి అనేక రకాలైన సమస్యలను ప్రక్షాళన చేయాలన్నారు. ఫీజుల దోపిడి, పుస్తకాలు, ఏకరూప దుస్తులు అమ్మకాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, జీఓ నెంబర్ 1ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు


పోస్ట్‌బేసిక్ స్కూల్‌లో మాట్లాడుతున్న దేవి

పెంటపాడు: మండలంలోని స్థానిక ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలను ఏపీ ఫుడ్ కమిటీ సభ్యురాలు దేవి సందర్శించారు. పాఠశాలలో రాగిజావ పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్స్‌లలోని అంశాలను తెలుసుకొన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం డీవైఈఓ శ్రీరామ్, ఎండీఎం ఏడీ ఫణి, కో ఆర్డినేటర్ కృష్ణారావు, పెంటపాడు ఎంఈఓ శ్రీనివాస్,హెచ్ఎం రాజేష్‌లు పాల్గొన్నారు. అంతేగాక ఎస్సీ బాలురు హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులతో ఆమె ముచ్చటించారు. హాస్టల్ వార్డన్ ఎం.రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో గృహనిర్మాణ సంస్థకు అగ్రస్థానం

సాక్షి, భీమవరం: గృహ నిర్మాణ సంస్థ గూడు లేని నిరుపేదలకు అనేక లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి దేశంలోనే అగ్రస్థానంలో ఉందని భీమవరం ఆర్డీవో దాసి రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం 45 ఏళ్ల ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అంజేశారు.

ఏలూరుపాడులో జిల్లా స్థాయి కమిటీ పర్యటన

కాళ్ల : కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో వ్యవసాయ భూమిని చేపల చెరువుగా మార్పు చేసే ప్రాంతాన్ని డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ బుధవారం పరిశీలించారు. జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ, పొల్యూషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఏలూరుపాడు పంచాయతీ కార్యాలయంలో రైతులు, గ్రామస్తులతో అధికారులు చర్చించారు. గ్రామంలోని గాంధీ బజార్ వీధిలో రక్షిత మంచినీటి చెరువు సమీపంలో వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్పుటకు ప్రయత్నాలు చేస్తుండగా గ్రామస్తులు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.